# అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- పల్లెల్లో మౌలిక వసతులు కల్పించిన ఘనత కేసీర్‌దే..
- భూపాలపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి
- చిట్యాల మండలంలో ఎన్నికల ప్రచారం
- ఘన స్వాగతం పలికిన నాయకులు, ప్రజలు
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు


చిట్యాల మండలం దూత్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర, తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు

చిట్యాల, నవంబర్ 6 : పదేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధికి పట్టంకట్టి బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలని బీఆర్ఎస్ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ప్రజలను కోరారు. భూపాలపల్లి మండలంలోని కొత్తపెల్లి(ఎస్ఎం), చిట్యాల మండలం దూత్‌పల్లి, లక్ష్మీపూర్‌తండా, ఒడితల, పాశిగడ్డతండా, గోపాలపూర్ గ్రామాల్లో నాయకులతో కలిసి గండ్ర ప్రచారం నిర్వహించారు. ఒడితలలో కాంగ్రెస్‌కు చెందిన 20 మంది కార్యకర్తలు, గోపాలపూర్‌లో 20 మంది కాంగ్రెస్ కార్యకర్తలను బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో గండ్ర మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్ద పీట వేశారన్నారు. అందులో భాగంగానే భూపాపల్లి జిల్లాగా ఏర్పడిందని, అన్ని మౌలిక వసతులు వచ్చాయన్నారు. తండాలను పంచాయతీలుగా చేసుకోవడంతో పాటు రోడ్లు, నాణ్యమైన విద్యుత్, ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్ కల్పించడంతోపాటు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే డబుల్ లేన్ రోడ్లు, మార్కెట్ యార్డులు, వందపడకల దవాఖాన, గురుకులాలు, 24గంటల విద్యుత్, కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ వంటి అనేక కార్యక్రమాల చేపట్టి అమల చేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. అనంతరం పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజల ముందు విశ్లేషణాత్మకంగా వివరించారు. బీజేపీ మత రాజకీయాలతో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకట్లు తప్పవని అందుకే సెక్యులర్ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మి పెనంలోంచి పొయ్యిలో పడ్డారన్నారు. పొరపాటున కాంగ్రెస్ గెలిస్తే ఇప్పుడు కొనసాగుతున్న పారదర్శక పథకాలన్నీ మళ్లీ పైరవీకార్ల చేతుల్లోకి పోతాయన్నారు. ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధికోసం నిరంతరం పరితపించే సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభా రఘుపతి, ఎంపీపీలు లావణ్య, దావు వినోదా వీరారెడ్డి, జడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతికుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు రవీందర్‌రావు, వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, ఆయా గ్రామాల సర్పంచులు పులి వెంకటేశ్, జవహర్‌లాల్‌నాయక్, లావుడ్యా రజితా హరిభూషణ్, దప్పటి రజితా శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి


నల్లగుంటలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి

# నాగజ్యోతిని ఆశీర్వదించండి

- గుర్రంపేట గ్రామాన్ని దత్తత తీసుకుంటా
- సీఎం కేసీఆర్ మాట ఇస్తే తప్పడు
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో ఉపాధి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన నల్లగుంట మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకులు

వెంకటాపూర్, నవంబర్ 6 : ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతిని ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలని నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రజలను కోరారు. సోమవారం మండల ఎన్నికల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావుతో కలిసి ఎమ్మెల్సీ నల్లగుంట గ్రామ బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ చర్లపెల్లి సునీతా సతీశ్‌గౌడ్ దంపతులతో పాటు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్సీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం గుర్రంపేటలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించగా 50 మంది వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం పోచంపల్లి మాట్లాడుతూ 2007లో మంత్రి కేటీఆర్‌తో కలిసి గ్రామాన్ని సందర్శించి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ గ్రామ అభివృద్ధి కోసం కేటీఆర్‌ను దత్తత తీసుకోవాలని కోరుతామన్నారు. తొమ్మిదేండ్లలో రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందిందో చూస్తున్నారని, మళ్లీ బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ప్రతి కుటుంబానికి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారని, ఆయన మాట ఇస్తే తప్పకుడా చేస్తారన్నారు. పరకాల దగ్గర టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో పదివేల ఉద్యోగాలు వచ్చాయని, 90 శాతం అందులో మహిళలకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పెరుగుతాయన్నారు. నియోజకవర్గంలో కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రతి మహిళ నెలకు రూ.20వేల నుంచి రూ.25 వేలు సంపాదించే ఆదాయ మార్గాలు చూపిస్తానన్నారు. సీఎం కేసీఆర్ త్వరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తీసుకోస్తున్నారని తద్వారా ఉపాధి కలుగుతుందన్నారు. కంపెనీల వారే మెటీరియల్ తీసుకొచ్చి ఇస్తారని, వాటి ద్వారా ఆదాయ మార్గాలు పెరుగుతాయన్నారు. సీఎం కేసీఆర్ ములుగు జిల్లాను అన్ని రకాల అభివృద్ధి చేశారని, ముమ్మందు మరింత అభివృద్ధి చేస్తారని లిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేయించి నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రజితా సమ్మయ్య, జడ్పీటీసీ గై రుద్రమదేవీ అశోక్, జిల్లా సీనియర్ నాయకులు మల్క రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేశ్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కూరెళ్ల రామాచారి, హర్జినాయక్, సర్పంచులు మందల సుచరితా శ్రీధర్‌రెడ్డి, రవీందర్, ఎంపీపీ సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్, మాజీ ఎంపీటీసీ జనగాం రవీందర్, ఆత్మ డైరెక్టర్ మందల మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు మంథనికి గులాబీ దళపతి

- నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరు
- పెద్దసంఖ్యలో తరలిరానున్న ప్రజలు
- సభా స్థలాన్ని పరిశీలించిన అభ్యర్థి పుట్ట మధూకర్



పెద్దపల్లి, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంగళవారం మంథనికి రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ అభ్యర్థి పుట్ట మధూకర్‌కు మద్దతుగా నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు హాజరుకానున్నారు. సభకు సుమారు 50 వేలమంది కదిలిరానుండగా ఇందుకు అనుగుణంగా సన్నాహకాలు చేశారు. మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి వెంట భారత్ పెట్రోల్ పంపు సమీపంలో 12 ఎకరాల స్థలంలో అన్ని ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు ప్రముఖులు సభలో పాల్గొననున్న నేపథ్యంలో సభ స్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. మంథనిలోని కొత్త ఐవోసీ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న స్థలంలో హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఎంపిక చేశారు. సోమవారం సభా స్థలంలో పుట్ట మధూకర్ ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

### సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇలా..

సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. అక్కడ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఆనంతరం తిరిగి హెలికాప్టర్‌లో మంథనికి మధ్యాహ్నం 2 గంటలకు చేరుకోని మంథని శివారులోని మంథని-గోదావరిఖని రహదారి వెంట ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. సభ అనంతరం హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

## బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

- పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి
- రేగొండ మండలంలో ఇంటింటా ప్రచారం

రేగొండ, నవంబర్ 6 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ జయశంకర్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని రంగయ్యపల్లి, నాగుర్లపల్లి, కనపర్తి, రాయపల్లి గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు పెద్ద పీట వేశారని, దేశంలో మరెక్కడా లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గాన్ని అభవృద్ధిలో ముందంజలో ఉంచారన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు మళ్లీ ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి హ్యాట్రిక్ బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేసి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఇంటింటా వివరించాలని కోరారు. ప్రచారంలో ఆయా గ్రామాల సర్పంచులు సంధ్య, తిరుపతి, సుధాకర్, నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు మోడెం ఉమేశ్‌గౌడ్, విజ్జన్‌రావు, భిక్షపతి, విద్యాసాగర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, కొలిపాక భిక్షపతి, వెంకటేశ్వర్‌రావు, పాపిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రజనీకాంత్, కరుణాకర్ పాల్గొన్నారు.


రేగొండ మండలం రంగయ్యపల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

## గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

పరకాల/హనుమకొండచౌరస్తా, నవంబర్ 6: పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24వ విద్యా సంవత్సరానికి అభ్యర్థులు ఇంగ్లిష్ సబ్జెక్టులో 55 శాతం (ఎస్సీ, ఎస్టీలు 50 శాతం) మార్కులతో పీజీ ఉత్తీర్ణ సాధించి ఉండాలని సూచించారు. సెట్, నెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 9లోగా విద్యార్హత సర్టిఫికెట్లను కళాశాలలో అందించాలని కోరారు. వివరాలకు 9951535357 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే, హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్-రెండు పోస్టులు ఉన్నాయని, యూజీసీ నిబంధనల ప్రకారం పీజీలో 55 శాతం మార్కులు, నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 7న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.